క్లుప్తంగా

నేడు అన్నదానం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయం ఆషాఢ మాస జాతర ఉత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏటా జాతర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఈ ఏడాది కూడా చేస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ అన్నసమారాధన జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

రహదారికి మరమ్మతులు


పెద్దాపురం-తామరాడ రహదారిలో గుంతలు పూడ్చిన జీడీవై సభ్యులు

పెద్దాపురం: గుడివాడ డెవలప్‌మెంట్ యూత్(జీడీవై) ఆధ్వర్యంలో శనివారం పెద్దాపురం-తామరాడ రహదారిలో మరమ్మతు పనులు చేపట్టారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో రోడ్డు గుంతలు ఏర్పడడంతో గ్రామ యువత ఏకమై సొంత ఖర్చులతో ఆ గుంతలను పూడ్చారు. 2019లో టీడీపీ ప్రభుత్వం హయాంలో నాణ్యత లోపంతో రహదారి నిర్మాణం చేపట్టడంతో పలు చోట్ల గుంతలు పడి నిత్యం ప్రజలు నరకం చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయంలో ఈ గుంతలను పూడ్చినప్పటికీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత పెద్దగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో జీడీవై యూత్ నాయకులు కనపర్తి సాయి ఆధ్వర్యంలోయువత ముందకు వచ్చి గుంతలను పూడ్చారు.

డ్వాక్రా రుణాల అవకతవకలపై విచారణ


పాత ఇసుపల్లిలో విచారణ చేస్తున్న డీపీఎం పద్మావతి

కొత్తపల్లి: డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందించే రుణాలు పక్కదారి పట్టాయంటూ పాత ఇసుకపల్లిలో డ్వాక్రా సంఘాల సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై మండలంలోని పాత ఇసుకపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వీవీ పద్మావతి విచారణ చేపట్టారు. వీఓఏగా పని చేస్తున్న పిరాటి పార్వతిని, డ్వాక్రా గ్రూపు సభ్యులను విచారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఓఏ పరిధిలో 48 గ్రూపులు ఉండగా ఇప్పటివరకూ 13 గ్రూపుల సభ్యులను విచారించామన్నారు. మిగిలిన గ్రూపులను సోమవారం విచారిస్తామని తెలిపారు. డ్వాక్రా మహిళల నుంచి సొమ్ములు వసూలు చేయడం, సభ్యులకు తెలియకుండా సొమ్ము డ్రా చేయడం , శ్రీనిధికి సబంధించి వడ్డీలేని సొమ్మును కొంతమంది సభ్యులకే ఇచ్చినట్టు బాధితులు తెలిపారన్నారు. స్వప్న గ్రూపునకు సంబంధించి ఉన్నతి లోను రూ.2 లక్షలు తీసుకుని ఒక్కరికే ఇచ్చారన్నారు. శ్రీనిధిలో రూ.3 లక్షలను ముగ్గురు సభ్యులు మాత్రమే తీసుకున్నారు. వినాయక గ్రూపునకు సంబంధించి సభ్యులకు రూ.11లక్షలు లోను అని చెప్పి బ్యాంకులో రూ.15 లక్షలు తీసుకున్నట్టు తెలిపారు. రూ.4 లక్షలు వీఓఏ వాడుకుందన్నారు. దీనిపై శ్రీనిధి మేనేజర్‌తో సోమవారం పూర్తి విచారణ చేస్తామని తెలిపారు.

నత్తనడకన ఈ-క్రాప్ నమోదు

- గతేడాది ఆగస్టుకు 60 శాతం పూర్తి
- సాంకేతిక లోపంతో పూర్తి కాని ఈ-క్రాప్
- తలలు పట్టుకుంటున్న వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది


పెద్దాపురం మండలంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వీహెచ్‌ఏ

పెద్దాపురం: రైతులకు ఎన్నో రకాలుగా ఉపయోగపడే ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. నియోజకవర్గ పరిధిలోని రెండు మండలాల్లో ఈ-క్రాప్ బుకింగ్ వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సంయుక్తం నిర్దేశించిన సమయానికి పూర్తి చేయలేక తలలు పట్టుకుంటున్నారు. గత ఏడాది ఇదే సమయానికి శరవేగంగా ఈ-క్రాప్ నమోదు చేశారు. దీని ద్వారా సంబంధిత యాప్‌లో రైతు పేరు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు, ఏయే పంట వేశారో వంటి వివరాలను నమోదయ్యాయి. ఈ-క్రాప్ బుకింగ్స్ ద్వారా కచ్చితమైన పంట, గణాంకాలను నమోదు చేస్తారు. విపత్తుల సమయంలో పంట నష్టపోతే పరిహారం అందించడమే కాకుండా గత ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో రైతులకు అందేలా ఉపయోగపడుతుంది. ప్రస్తుత ప్రభుత్వంలో సాంకేతిక లోపం కారణంగా ఈ-క్రాప్ బుకింగ్ నత్తనడకన సాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 60 శాతం పూర్తి కాగా ప్రస్తుతం 20 శాతం మాత్రమే అయినట్టు అధికారులు చెబుతున్నారు.

పంట సాగు విస్తీర్ణం

నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం మండలంలో 10 వేల ఎకరాలు, సామర్లకోట మండలంలో 23 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. మిగతా అన్ని పంటలు ఆయిల్‌పామ్, దుంప, జీడిమామిడి తదితర పంటలు సుమారు 10 వేల ఎకరాలకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ జరుగుతుంది.

ఈ క్రాప్ నమోదు ఇలా

ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లో సంబంధిత అధికారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ-క్రాప్ నమోదు చేస్తారు. రైతుల పొలం వద్దకు అంటే సర్వే నంబర్ల ప్రకారం అధికారులు వెళ్లి ట్యాప్‌లో యాప్ ఓపెన్ చేసి క్లిక్ చేయగానే 20 మీటర్ల పరిధిలోని సర్వే నంబర్లు కనిపిస్తాయి. అనంతరం ఆ సర్వే నంబర్లలో రైతు పేరును నిర్ధారణ చేసుకుని యాప్‌లో ఏ పంట వేశారో నమోదు చేయాలి. పొలం వద్దే రైతు ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేసి వెంటనే ఆధార్, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. దీంతో ఆ సర్వే నంబర్‌కు ఏ కాలువ నుంచి సాగునీరు వస్తుంది, నీటి తీరువా ఎంత చెల్లించాల్సి ఉంటుంది వంటి వివరాలు తెలుస్తాయి. పంట చిత్రాలను జీపీఎస్ పద్ధతి ద్వారా సర్వర్‌కు పంపుతారు. సర్వే నంబర్లలో తేడాలను అధిగమించేందుకు వీఆర్ఓలు, ఎంపీఈఓలు సంయుక్తంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తారు. ఈ నెలాఖరులో పంట వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ అధికారులు. రెవెన్యూ శాఖ సిబ్బంది చురుగ్గా ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరి



ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేశాం. ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ఇది మేలు చేస్తోంది.
-ఎం.చిలకమ్మ., వ్యవసాయ సహాయకురాలు, ఆర్‌బిపట్నం, పెద్దాపురం మండలం

పక్కాగా నమోదు చేస్తున్నాం



ఈ-క్రాప్ బుకింగ్‌ను నిబంధనలకు అనుగుణంగా పక్కాగా నమోదు చేస్తున్నాం. నమోదు ప్రక్రియ వ్యవసాయ సహాయకులు, వీఆర్ఓలు సంయుక్తంగా చేపట్టాం. పంటల నమోదులో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం.
- కె.సంజయ్‌కుమార్, ఏఒ, పెద్దాపురం మండలం

రచయిత గౌరీనాయుడికి సత్కారం


గౌరీ నాయుడును సత్కరిస్తున్న సంస్కృత భారతి సభ్యులు

పిఠాపురం: పట్టణానికి చెందిన యువ సాహితీవేత్త, రచయిత, డాక్టర్ కిలారి గౌరీనాయుడును శనివారం విశాఖపట్నంలో ఘనంగా సత్కరించారు. విశాఖపట్నంలోని ఎస్‌వీవీపీవీఎంసీ డిగ్రీ కళాశాలలో సంస్కృత భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్కృత భాష అధ్యయనం, ప్రాముఖ్యత అనే అంశంపై ప్రసంగించారు. సంస్కృతం నేర్చుకోవడానికి, మాట్లాడడానికి అవసరమైన మెళకువలను విద్యార్థులకు వివరించారు. సంస్కృతం నేర్చుకోవడం వల్ల అనువాద రంగం, విద్యా రంగంలో ఉండే ఉపాధి అవకాశాలను తెలియజేశారు. అనంతరం సంస్కృత భారతీ ప్రతినిధులు నరసింహస్వామి, కె.సూర్య కుమారి, వెంకటలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ కె.జగదీశ్వరరావు, అధ్యాపకులు గౌరీనాయుడును ఘనంగా సన్మానించారు. రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ కార్యవర్గ సభ్యులు, సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ ప్రతినిధులు గౌరీ నాయుడికు అభినందనలు తెలిపారు.

విద్యార్థులలో ప్రతిభను గుర్తించాలి

- రెండో తరగతి విద్యార్థి ప్రతిభకు గుర్తింపు
- బహుమతి అందజేసిన డీఎస్పీ లతాకుమారి


గొంచాలలో రెండవ తరగతి విద్యార్థికి బహుమతి అందజేసిన డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: విద్యార్థులలో ఉన్న ప్రతిభను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి అన్నారు. గొంచాల గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి జీవన్‌కుమార్‌ను అభినందించి బహుమతి అందజేయడానికి శనివారం ఆమె ప్రత్యేకంగా హాజరయ్యారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థి స్వాతంత్ర్య సమర యోధుల గురించి ఇంగ్లీషులో అనర్గళంగా స్పీచ్ ఇచ్చాడు. ఈ సంఘటన అనేక సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీనిని గమనించిన డీఎస్పీ లతాకుమారి పాఠశాలకు వచ్చి విద్యార్థి జీవన్‌కుమార్‌ను, అతని తల్లి దండ్రులను అభినందించి విద్యార్థికి బహుమతి అందజేశారు. రెండో తరగతిలోనే విద్యార్థిలో దేశ భక్తి పెంచేలా ప్రయత్నం చేసిన హెచ్‌ఎం బీఎస్ఎన్ మూర్తిని అభినందించారు. ప్రతి విద్యార్థిలోను ఏదో ఒక రంగంలో ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే ఆణిముత్యాలు ఉంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

కొత్తపల్లి: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలో కొండెవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్‌గా వేమగిరి రాంబాబు, వైస్ చైర్మన్‌గా పిల్లి నాగలక్ష్మితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నూతన కమిటీ సభ్యులను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు.

నేడు గణపతి విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపల్లి: మండలంలోని గోర్స గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం వరసిద్ధి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని శనివారం ఆలయం వద్ద గణపతి పూజ, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో భర్తీ కాని పోస్టులు

- పెరుగుతున్న సమస్యలు


సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో కీలకమైన పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇంజనీరింగ్ శాఖలో ఏఈ, టౌన్ ప్లానింగ్ శాఖలో టీపీఎస్, రెవెన్యూ శాఖలో రెవెన్యూ అధికారి, పారిశుధ్యానికి సంబంధించి శానిటరీ ఇన్‌స్పెక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంజినీరింగ్ సెక్షనలో డీఈ మహిళా ఉద్యోగి దివ్యాంగురాలు రావడంతో బయటకు రాలేని పరిస్థితి ఉందని, దాంతో ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులు, లైటింగ్ సమస్యలు పర్యవేక్షణ చేసే వారు కనిపించడం లేదనే వాదనలు ఉన్నాయి. సుమారు మూడేళ్లగా శానిటరీ ఇన్‌స్పెక్టరు పోస్టు భర్తీ చేయకపోవడంతో ఇన్‌చార్జిలు మొక్కుబడిగా వ్యహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ అధికారి లేకపోవడంతో ఇంటి పన్నులు, మున్సిపల్ షాపుల అద్దెల బకాయిలపై శ్రద్ధ చూపలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నిత్యం పట్టణంలో పర్యటించి ఆక్రమణలు, నూతన భవనాల నిర్మాణంపై పర్యవేక్షణ చేసి ఇళ్ల నిర్మాణాలు చేసుకొనే వారికి అవగాహన కల్పించి ఇంటి ప్లాన్లు పెట్టుకొనేలా చూడాలి. మున్సిపాలిటీలో ముఖ్యమైన శాఖలకు చెందిన అధికారులు లేకపోవడంతో సమస్యలు తిష్ట వేస్తు న్నాయి. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తే సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందనే వాధనలు ఉన్నాయి.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు


సమావేశంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

సామర్లకోట: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ఉమ్మడి జిల్లా ఎఐటీయుసీ ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ భవనంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పనిని బట్టి వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. పదవీ విరమణ చేసిన, చనిపోయిన కార్మికుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అమలు చేయాలన్నారు. మార్చి 16 నుంచి నిలిచిపోయిన కార్మికుల నమోదు ప్రక్రియను పునరుద్ధరించాలన్నారు. జీపీఎఫ్ ఖాతాలను తెరవాలని డిమాండ్ చేశారు. ఆఫ్కోస్‌ను రద్దు చేసి వారి వేతనాలను మున్సిపాలిటీ నేరుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 3వ తేదీన విశాఖలో జరిగే ఏఐటీయూసీ బారా ప్రదర్శనకు కార్మికులందరూ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, లక్ష్మి, దళయ్య, పెద్ద శ్రీను, కె.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జపయజ్ఞ పారాయణ


పారాయణలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక భోగి గణపతి పీఠంలో శనివారం శ్రీవారి 45వ జపయజ్ఞ పారాయణ వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత వేళలో తిరుమంజన కార్యక్రమం, ప్రబంధ పారాయణ, పుష్పాలంకరణ, తోమాలసేవ నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ తులసిదళాల పూల మాలలతో ఏడుకొండల స్వామికి ఆళ్వారుల చేపట్టిన అలంకరణ ఆరాధన కలియుగం ఆరంభం నుంచి జరుగుతుందన్నారు. పీఠంలో నిర్వహించే వేంకటేశ్వరస్వామి వ్రత పూజ కల్యాణోత్సవం సందర్భంగా శ్రీవారి సేవా సమాజం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేర్చుకున్న అంశాలను అమలు చేస్తేనే ఫలితం

- ఎంఈఓ శివరామ కృష్ణయ్య
- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల తనిఖీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశాలో నేర్చుకున్న అంశాలను పూర్తిగా అర్థం చేసుకొని ఆయా పాఠశాలల్లో అమలు చేయాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామ కృష్ణయ్య అన్నారు. శనివారం పట్టణ, మండల పరిధిలో నవర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నవర స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశాలు టైంటేబుల్ ప్రకారం జరగాలన్నారు. అన్ని సెషన్స్‌లోను విద్యా విషయాలపై పూర్తిగా చర్చించాలన్నారు. పాఠశాలల్లో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజనంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భోజనం రుచిగా ఉంటే అందరూ తింటారని, వంద శాతం ఉండేలా చూడాలన్నారు. అన్ని సక్రమంగా ఉండాలని, విద్యాశాఖాధికారులు తరచూ తనిఖీలు చేసే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ప్రసూన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంకండి

కాకినాడ రూరల్: కాకినాడ, పరిసర ప్రాంతాలలో దొంగతనాలు జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో రాత్రి వేళల్లో గస్తీ పెంచారు. తిమ్మాపురంలో ఆటోతో ఎస్సై రవీంద్రబాబు, సిబ్బంది పలు వీధులు, కూడళ్లలో పర్యటించి దొంగతనాలపై గ్రామస్తులను అప్రమత్తం చేశారు. పెళ్లిళ్ల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తాళాలు వేసినట్టు బయటకు కనిపించకుండా జాగ్రత్త పడాలని, విలువైన బంగారు ఆభరణాలను బ్యాంక్ లాకర్లలో ఉంచుకోవాలన్నారు, ఎవరైనా ఊర్లు వెళితే తమకు సమాచారం ఇస్తే లాక్డ్ మానిటరింట్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాన్నారు.

పురస్కారాలతో మరింత బాధ్యత

ఎంపీపీ సత్తిబాబు


పురస్కారాలు అందుకున్న ఉద్యోగులను సత్కరించిన సామర్లకోట ఎంపీపీ సత్తిబాబు, ఎంపీడీఓ శ్రీలలితలు

సామర్లకోట: పురస్కారాలు అందుకున్న ఉద్యోగులకు మరింత బాధ్యత పెరుగుతుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడలో పురస్కారాలు అందుకున్న ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ డి.చంద్రశేఖర్, అటెండర్ వై.అప్పారావులను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్ని మండల పరిషత్ కార్యాలయం పరిధిలో పని చేసే ముగ్గురు ఉద్యోగులకు పురస్కారాలు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన డి.శ్రీలలిత మాట్లాడుతూ గతంలో మండల పరిషత్ కార్యాలయంలో పని చేసిన సమయంలో ఉన్న ఉద్యోగులకు అవార్డులు రావడం వారిని తన ఆధ్వర్యంలో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా ఆందోళనలు

- విధులు బహిష్కరించిన డాక్టర్లు, వైద్య సిబ్బంది
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

పిఠాపురం: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై ఇటీవల జరిగిన హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పని చేస్తున్న సిబ్బంది విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పిఠాపురం సీహెచ్‌సీ వైద్యులు విధులు బహిష్కరించి ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు సుజాత, రవి కుమార్ మాట్లాడుతు కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన దాడిని అమానుష చర్యగా పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థాయిలో దర్యాప్తు చేసి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు.


ఆర్డీఓ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న వైద్యులు

కార్యక్రమంలో పలువురు వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి ఉద్యోగుల నిరసన

సామర్లకోట: కలకత్తాలో పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది విధులు బహిష్కరించి శనివారం నిరసన తెలిపారు. డాక్టరు రాకేష్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి జూనియర్ డాక్టరును హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి నుంచి పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు డాక్టరు రాకేష్ మాట్లాడుతూ కలకత్తా ప్రభుత్వాస్పత్రిలో జూనియర్ డాక్టరుపై జరిగిన చర్యను తీవ్రంగా ఖండించారు. అక్కడ ప్రభుత్వం ఈ కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేయడంతో డాక్టర్లు అందరూ ఐక్యంగా పోరాటం చేయాలని నిర్ణయించి ఈ మేరకు జూనియర్ డాక్టరు ఆత్మకు శాంతి కలగాలని సంఘీభావం తెలియజేస్తున్నామన్నారు. డాక్టరు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టరు హత్యకు నిరసనగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ ఓపీ బంద్ చేసినట్టు తెలిపారు. ప్రతి ప్రభుత్వాస్పత్రిలోను మహిళా డాక్టర్లు, సిబ్బంది ఉన్నారని, వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రి ఆవరణలో 24 గంటలు పని చేసేలా పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు ఆస్పత్రి సిబ్బందికి రక్షణ కల్పిస్తే, తాము ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించేలా ధైర్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టరు కార్తిక్, హెడ్ నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


గొల్లప్రోలులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


కొమరగిరిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

పెద్దాపురంలో రోడెక్కిన వైద్యులు

పెద్దాపురం: కలకత్తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా శనివారం పెద్దాపురం అర్బన్, రూరల్ పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల వైద్యులు రోడెక్కారు. స్థానిక ఏరియా ఆసుపత్రి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ చేశారు. హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విదులను బహిష్కరించి ఆసుపత్రి సేవలను బంద్ చేశారు. దీంతో రోగులు ఇక్కట్లకు గురయ్యారు. వైద్యురాలికి మృతికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదాంబ, రేవన లిల్లీ, ప్రియదర్శిని, అనూష, హెడ్ నర్సు రమాదేవి, ఫార్మసిస్ట్ కమలకుమారి, ఐసీటీసీ కౌన్సిపల్ బి.శ్రీనివాస్, శేఖర్ పాటు కాండ్రకోట, పులిమేరు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

పిఠాపురం: కోలకతాలో పీజీ చదువుతున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు డిమాండ్ చేశారు. కలకత్తా అత్యాచారం ఘటనకు వ్యతిరేకంగా శనివారం గొల్లప్రోలులో ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తొలుత చనిపోయిన డాక్టర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన దాడిని అమానుష చర్యగా పేర్కొన్నారు. డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి. నారాయణ మూర్తి, కేశవరపు వీరబాబు, గుడాల చార్లెస్, గొర్ల శివ, నాగేశ్వరరావు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు చేయడం దుర్మార్గం

కొత్తపల్లి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే వైద్యులపై దాడులు చేయడం దుర్మార్గమని కొమరగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా మండలంలోని కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సందీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దాపురం ఆసుపత్రి వద్ద వద్ద నుంచి నిరసన ర్యాలీ నిర్వహిసున్న వైద్యులు


సామర్లకోటలో నిరసన తెలుపుతున్న డాక్టర్లు, సిబ్బంది


పిఠాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది